# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 20, ఫిబ్రవరి 2026




## శివాజీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ పాల్గొని గాంధీ చౌక్ నుంచి శివాజీ చౌక్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు శివాజీ చేసిన పోరాటం మరువలేనిదని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు తగరపు గంగన్న, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్ సర్కార్

* క్యాతనపల్లిలో దళిత, గిరిజన మహిళ కౌన్సిలర్ల పై దౌర్జన్యం
* ఆక్షేపణీయం బాల్క సుమన్ అరెస్టు కక్ష సాధింపే.ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్న పోలీసులు మూల్యం చెల్లించక తప్పదు
* ఆదిలాబాద్ జైల్లో బాల్క సుమన్‌ను పరామర్శించిన బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు
* మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆరోపణలు



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం అరెస్టు అయి ఆదిలాబాద్ సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న విద్యార్థి నాయకుడు బాల్క సుమన్ తో పాటు రాజిరెడ్డి, అనిల్, లక్ష్మికాంత్‌లను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని హరీష్ రావు విమర్శించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, ఆసిఫాబాద్ లలో జైళ్లు ఉన్నప్పటికీ కక్షపూరితంగా మిగతా 2లో..



## బాల్క సుమన్ అరెస్టుకు నిరసనగా బంద్ సంపూర్ణం

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

భారత రాష్ట్ర సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టును నిరసిస్తూ, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపు మేరకు బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా బంద్ నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంతో పాటు పలు మండలాల్లో బంద్‌కు విశేష స్పందన లభించింది. బెల్లంపల్లిలో ప్రభుత్వేతర కార్యాలయాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూతపడి బంద్‌కు మద్దతు తెలిపాయి. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొనడంతో పట్టణంలో సాధారణ కార్యకలాపాలు నిలిచిపోయాయి. బంద్ ప్రశాంతంగా కొనసాగింది. దేవాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశానుసారం అన్ని వ్యాపార వాణిజ్య సముదాయాలను మూసివేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు కొమురం భీమ్ చౌరస్తాలో చేరి నిరసన కార్యక్రమం నిర్వహించి, బాల్క సుమన్ అరెస్టును ఖండిస్తూ నినాదాలు చేశారు. అలాగే, నెన్నెల మండల కేంద్రంలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ మిగతా 7లో..

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం రోజున జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో చేపట్టిన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను సందర్శించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఒకే చోట సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేయాలని తెలిపారు.



## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

✪ జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని తన చాంబర్లో వేసవిలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సిర్పూర్ యు, లింగాపూర్, తిర్యాణి మండలాలలోని మారుమూల గిరిజన గ్రామాలకు నీటి సరఫరాను సక్రమంగా అందించేందుకు పైపులైన్లు, పంప్ హౌస్‌లకు మరమ్మతులు చేయాల్సి ఉంటే నెలలోగా పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కెరమెరి మండలంలోని ధనురా వద్ద డబ్ల్యూపిటి పాయింట్ నిర్మాణ పనులను ఏప్రిల్ లోగా పూర్తి చేసి ప్రజలకు శుద్ధ జలాన్ని అందించాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఇంటికి నీరు అందించే కార్యక్రమంలో భాగంగా పైప్ లైన్, ఓవర్ హెడ్ ట్యాంకులు, చేతి పంపులు, బోరు బావులను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ రాకేష్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సిద్ధిఖ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

200 కిలోమీటర్ల దూరంలోని ఆదిలాబాద్ జైలుకు తరలించడం దుర్మార్గమన్నారు.

### క్యాతనపల్లిలో చైర్మెన్ ఎన్నిక వాయిదా ప్లాన్..?

క్యాతనపల్లిలో 22 స్థానాలకు గాను 14 స్థానాలు బిఆర్ఎస్ కూటమి గెలుచుకుందని, ప్రజలు ఇచ్చిన తీర్పును మంత్రి వివేక్ వెంకటస్వామి శిరసావహించాల్సింది పోయి దొడ్డిదారిన అధికారం లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కోరం ఉన్నప్పటికీ చైర్మన్ ఎన్నిక రోజున కావాలని పోలీసు బందోబస్తు లేకుండా చేసి ఎన్నికను వాయిదా వేయించారని పేర్కొన్నారు. అధికారులు, పోలీసుల సమక్షంలోనే దళిత, గిరిజన మహిళ కౌన్సిలర్ల పై కాంగ్రెస్ నేతలు అసభ్యంగా ప్రవర్తించారని మహిళలపై చేయి చేసుకున్నారని ఆయన ఆక్షేపించారు. మహిళల ఫిర్యాదును రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో స్వీకరించలేదని అన్నారు.



జైలు ముందు బైఠాయించి బాల్క సుమన్ విడుదలకు డిమాండ్ చేస్తున్న నాయకులు

### "ప్రశ్నించిన వారిపైనే కేసులా..?"

కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్యం సేవించి సమావేశానికి వచ్చిన కేసులు నమోదు చేయలేదని, రాజిరెడ్డి వాహనం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని, కానీ బిఆర్ఎస్ కౌన్సిలర్లపై మాత్రం అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. పోలీస్ స్టేషన్లలో అరెస్ట్ అయిన తమ నాయకులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్న పోలీసులు చూస్తూ ఊరుకుంటున్నారని విమర్శించారు. జనగామ, ఇబ్రహీంపట్నం అమంగల్ క్యాతనపల్లిలో, బిఆర్ఎస్ కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేయడానికే పోలీస్ కవాతు నిర్వహించారని ఆయన అన్నారు. ఇబ్రహీంపట్నంలో స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం జరిగిందని తెలిపారు.

### రాహుల్ గాంధీ ఎందుకు స్పందించరు..?

దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణపై మాట్లాడే రాహుల్ గాంధీ తెలంగాణలో ప్రజాతీర్పు కాలరాస్తున్నారని ఆరోపణలు ఉన్నప్పటికీ ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా ఆమోదం కోల్పోయారని వాఖ్యానించారు. రాష్ట్ర ఇన్చార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్ ఎందుకు నోరు విప్పరని ప్రశ్నించారు. కాంగ్రెస్ బిజెపి మైత్రి ఈ ఎన్నికల్లో స్పష్టమైందని బిజెపి ఎంపీ పోలీసులను దూషించిన అరెస్టులు లేవని ఆరోపించారు.

### అధికారం శాశ్వతం కాదు...

పోలీసు అధికారులకు హరీష్ రావు హెచ్చరిక జారీ చేస్తూ, అధికారం శాశ్వతం కాదని కాలం మారుతుందని అన్నారు. చట్టాన్ని అతిక్రమించిన బిఆర్ఎస్ నాయకులపై అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులు తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. క్యాతనపల్లి ఘటనపై గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకుని, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించని అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్ పాత్రను కూడా పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా తీర్పును కాల రాస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని హరీష్ రావు పిలుపునిచ్చారు.

### జైలు వద్ద తోపులాట...

ముఖ్య నాయకుల రాకతో జిల్లా జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జైలుకు చేరుకున్న హరీష్ రావు లీగల్ టీం సభ్యులతో కలిసి కేసు వివరాలు తెలుసుకున్నారు. అయితే ఇతర నాయకులను లోపలికి అనుమతించకపోవడంతో పోలీసులకు బిఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట చోటుచేసుకుని స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం జైలు గేటు ఎదుట బిఆర్ఎస్ నాయకులు బయట నుంచి బాల్క సుమన్ విడుదలకు డిమాండ్ చేశారు. హరీష్ రావు వెంట బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ షమీపూర్ రాజు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, భోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ కె.హరిత - కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన
- అదనపు తరగతి గదుల పనులు వేగవంతం చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత



శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల మైనారిటీ సంక్షేమ పాఠశాలలో ఆసిఫాబాద్, కెరమెరి, తిర్యాణి మండలాల నూతన సర్పంచ్‌లకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక భూమిక ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే పలు సంక్షేమ పథకాల అమలులో అర్హులకు అందేలా గ్రామ ప్రథమ పౌరుడిగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, ఇంటి పన్నుల అంశాలను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చర్యలు చేసుకోవాలని, పలు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి అయ్యేలా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా కార్యచరణ రూపొందించుకోవాలని, గ్రామాలలో జరిగే సంక్షేమ పథకాలు, పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి వినియోగంలోకి వచ్చే విధంగా పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారులు ఉమర్ హుస్సేన్, హరి ప్రసాద్, రిసోర్స్ పర్సన్లు, సర్పంచ్‌లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భూ రీసర్వే ప్రక్రియ వేగవంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య.

**తాండూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :**

జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.చంద్రయ్య అన్నారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామం భూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా గురువారం సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రికార్డుల ఆధారంగా భూ రీ సర్వేలో పొరపాట్లు లేకుండా సక్రమం చేపట్టాలని సూచించారు. భూ సమస్యలపై ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతులకు సంబంధించిన భూ వివాదాలు ఏమైనా ఉంటే రెవెన్యూ కార్యాలయంలో సంబంధిత అధికారులను సంప్రదించి సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, సర్పంచ్ మాసాడి తిరుపతి, గిర్దావర్ పద్మజ, భూ సర్వే అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

## పంచాయతీ కార్యదర్శులతో అధికారుల సమీక్ష సమావేశం

**జైపూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటి పన్ను ను వంద శాతం వసూలు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లు, దరఖాస్తు దారులు కోరిన సమాచారం పంపిణీ, నర్సరీల నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ, ఉపాధి హామీ పనులకు కూలీలను తీసుకు వెళ్లడం లాంటి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల అమలు సంబంధించిన సిబ్బంది సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఏపీవో బి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీలకు బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులు ఎంపిక

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బెల్లంపల్లి సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ నుంచి బెల్లంపల్లి నియోజకవర్గం లెవల్లో బెల్లంపల్లి సీఓఈ నుంచి ముగ్గురు విద్యార్థులు బి.ఉషా కిరణ్, టి.రాజ వర్ధన్, కే.సాయి రోహిత్, జె.సాయి రితీష్ రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఫుట్బాల్‌కి ఎంపిక అవడం పట్ల ప్రిన్సిపల్ ఆకిడి విజయ సాగర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ లెవల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిఓఈ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఫుట్బాల్ ఆటతో మంచి రన్నింగ్ స్కిల్, నాయకత్వ లక్షణాలు విద్యార్థులు కలుగుతాయని విద్యార్థులకు సూచించారు. పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చకుర్తి రాజశేఖర్ విద్యార్థులకు పుష్పగుచ్ఛమిచ్చి అభినందించి ఆల్ ది బెస్ట్ చెప్పారు.







శివాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న యువకులు



తాండూర్‌లో నిర్వహిస్తున్న చత్రపతి శివాజీ ర్యాలీ

## మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన

# మహాయోధుడు శివాజీ

* ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు
* మార్మోగిన జై శివాజీ.. జై భవాని నినాదాలు
* గుస్సాడీ నృత్యాలు, విగ్రహావిష్కరణలతో కోలాహలం

### * ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరాఠా సామ్రాజ్యాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, అజేయమైన మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన గొప్ప వీరుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు. ఆయన పరాక్రమం, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల ప్రజా ప్రతినిధులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

హిందూ స్వరాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను పెంచికల్ పేట్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గాపల్లి గ్రామంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి కాషాయ పతాకాలని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైందవ, శివాజీ, యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ హైందవ ధర్మ పరిరక్షణకు చేసిన సేవలను స్మరించుకున్నారు. స్వరాజ్య సాధనలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, పరిపాలనా నైపుణ్యం, దేశభక్తి భావం యువతకు ఆదర్శనమని అన్నారు. గ్రామాల వారీగా శోభయాత్రలు నిర్వహించి జై శివాజీ నినాదాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు యువకులు మహిళలు పాల్గొన్నారు.



శివాజీ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆరె సంక్షేమ సంఘం సభ్యులు

### తాండూర్ ఐబిలో ఉత్సాహంగా భారీ ర్యాలీ....

**తాండూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

ధర్మ పరిరక్షణ, స్వరాజ్య స్థాపన కోసం శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ అని శివాజీ యువసేన నేతలు కొనియాడారు. ఛత్రపతి శివాజీ ఉత్సాహ కమిటీ, యువసేన ఆధ్వర్యంలో గురువారం తంగళ్ళపల్లి హనుమాన్ మందిర్ నుంచి ఐబి జాతీయ రహదారి వరకు యువకులు, నాయకులు కాషాయ జెండాలతో ఉత్సాహంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధైర్యం, దేశభక్తి కి మారుపేరని, కోట్లాదిమంది భారతి భారతీయులకు స్ఫూర్తి దాయకుడు, వీర యోధుడు అని అన్నారు. యువత శివాజీ ఆశయాలు, స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఐబిలో జై భారత్ మాత, జై శివాజీ, జైశ్రీరామ్, జై హనుమాన్ అంటూ చేసిన యువసేన నేతలు, యువత చేసిన నినాదాలు మారుమోగాయి. ఎలాంటి అబాంఛనీయ సంఘటనలు జరగకుండా తాండూర్ సిఐ దేవయ్య ఆధ్వర్యంలో మాదారం ఎస్సై సౌజన్య, తాండూర్ ఏఎస్ఐ రాజమొగిలి, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒక గొప్ప పోరాటయోధుడు..

**జన్నారం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

చత్రపతి శివాజి మహారాజ్ ఒక గొప్ప పోరాట యోధుడు, మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి భారత దేశంలో హిందూ రాజ్యాన్ని స్థాపించిన గొప్ప వీరుడని హిందువాహిని తెలంగాణ ప్రాంత ప్రముఖ్ ఆదర్శ్ భారతీయన్ అన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హిందూ వాహిని కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై భారీ శోభాయాత్రను నిర్వహించారు. జన్నారం మండలం రేండ్లగూడ రామాలయం వద్ద నుండి ప్రధాన ర్భహదారి మీదుగా, అలాగే ప్రధాన వీధుల గుండా ద్విచక్ర వాహనాలతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. జన్నారం నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ కూడలి దగ్గర మొత్తం కాషాయం తోరణాలు కట్టి ఆ ప్రాంతమంతా కాషాయమయం చేశారు. అక్కడినుండి మండలంలోని చర్లపల్లి గ్రామం వరకు పెద్ద సంఖ్యలో హాజరైన హిందూ వాహిని కార్యకర్తలు, శివాజీ మహారాజ్ అభిమానులు, ధర్మవీర్శంబాజీ మహారాజ్ వారసులు భారీగా ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రాంత ప్రముఖ్ ఆదర్శ్ భారతీయన్, హిందూ ఉత్సవ కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చెంచు రాజు కిరణ్ చేతుల మీదుగా చర్లపల్లి గ్రామంలో నూతన చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ గొప్పతనం ఆయన యుద్ధనీతిలో ఉందని, గొరిల్లా యుద్ధ తంత్రంతో శత్రువులను ముప్పుతిప్పలు పెట్టిన మహనీయుడని, గొప్పయోధుడని, గొప్ప పాలకుడు, అందుకే ఆయనను భారత నౌకాదళ పితామహుడిగా కూడా పిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు జి గణేష్, హిందు వాహిని జిల్లా ఉపాధ్యక్షులు దండవేణి శ్రీధర్, హిందు వాహిని మండల అధ్యక్షులు చెరుకు ప్రణయ్, ఉపాధ్యక్షులు రంగు రాకేష్ గౌడ్, హిందూ ఉత్సవ సమితి మండల అధ్యక్షులు అంతే రఘు, దేవేందర్, మగిడి తిరుపతి, ఎరుకల రమేష్ గౌడ్, శివాజీ కమిటీ మండల అధ్యక్షులు ఒడిపల్లి రాజేష్, ఎంబడి సత్యం, కమిటీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

### శివాజీ ఆశయాలు యువత అనుసరించాలి..

**చింతలమానేపల్లి ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

యువత శివాజీ ని ఆదర్శంగా తీసుకోవాలని ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తొంబిరే శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు, బాబాసాగర్, బాలాజీ అనుకోడ, గంగాపూర్, గూడెం తదితర గ్రామాలలో 396వ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆయా గ్రామాల ప్రజలు బాజభజంత్రీలతో ర్యాలీగా వచ్చి శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా గ్రామాల అధ్యక్షుల గ్రామాలలో సంఘం జెండను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ స్వాతంత్ర వీరుడిగా దాస్య విమోచకుడిగా ప్రఖ్యాతగాంచి భారతదేశ పుటలలో ప్రముఖ స్థానం పొందిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దుబ్బుల నానయ్య, ఆరె సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు దుబ్బుల మహేష్, రాష్ట్ర కార్యదర్శి దుబ్బుల వెంకన్న, వెల్మలే మల్లయ్య, గ్రామ అధ్యక్షుడు చౌదరి రాజన్న, దుబ్బుల మురళీ, ప్రశాంత్, కొంపరి సాయి, చౌదరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**సిరికొండ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంతో పాటు సోంపల్లి, రాంపూర్, పొన్న గ్రామాల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద యువసేన అధ్యక్షుడు గైక్వాడ్ గజానంద్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పించగా, రాంపూర్, సోంపల్లి గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాలను తహసిల్దార్ తుకారాం, ఎస్సై పూజతో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. పొన్న ఎక్స్ రోడ్ వద్ద శివాజీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 53 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షకుడు, మరాఠా యోధుడు శివాజీ మహారాజ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. రక్తదానం చేసిన యువకులకు అధికారులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చత్రపతి యువసేన సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సారంగాపూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

మండల వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో అల్లోల మురళీధర్ రెడ్డి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించగా, ఇక్కడ ప్రదర్శించిన గుస్సాడీ నృత్యం భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. అల్లూరు గ్రామంలో విగ్రహ దాతలు ఎనుగంటి రమ్యశ్రీ రోహిత్ గౌడ్, రాజ్యమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, అల్లోల మురళీధర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని, ఆయన చూపిన ధర్మరక్షణ, దేశభక్తి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. హిందువులందరూ ఐక్యంగా ఉండి సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ వేడుకల్లో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.





# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**దస్తురాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో హిందూ వాహిని, జై శివాజీ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూత్ సభ్యులు మాట్లాడుతూ.. సనాతన ధర్మ రక్షణ కోసం శివాజీ చేసిన పోరాటం, ఆయన దేశభక్తి, పరాక్రమం నేటి తరానికి ఎంతో ఆదర్శమని కొనియాడారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ధైర్యంగా ఎదుర్కొని హిందూ స్వరాజ్య స్థాపనకు కృషి చేసిన మహానుభావుడిగా శివాజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యువత, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి ఉత్సవాలను విజయవంతం చేశారు.

## శివాజీ ఆశయాలను యువత అలవర్చుకోవాలి: ఆరే మరాఠా సంఘం

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరే మరాఠా యువజన సంఘం ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా శివాజీ చిత్రపటంతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యవంశీ పండురంగ్ మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ అపార ధైర్యం, దూరదృష్టి, స్వరాజ్యం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను నేటి యువత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన జీవితం దేశసేవలో అంకితభావంతో, ఆత్మగౌరవంతో ముందుకు సాగేందుకు మనందరికీ నిరంతర ప్రేరణనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు కే.రాజు, బి.సాయికృష్ణ, గణేష్, అక్షయ్, సచిన్, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

**దస్తురాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

మండలంలోని రేవోజీపేట గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య వంశీకృష్ణ సమక్షంలో మంత్రోచ్ఛారణల మధ్య శివాజీ చిత్రపటంతో గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మనా రఘు మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ యొక్క అపార ధైర్యం, నాయకత్వం, స్వరాజ్యం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆయన జీవితం దేశసేవలో అంకితభావంతో ముందుకు సాగేందుకు నిరంతర ప్రేరణనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూగిరి కిషోర్, గ్రామ యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఎంపీడీఓకు వినతి పత్రం అందజేసిన బిఎల్‌వో

**దస్తురాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**



గత సర్పంచ్ ఎన్నికలు, కుల గణన విధులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మండలంలోని బూత్ స్థాయి అధికారులు గురువారం ఎంపీడీఓ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో, ప్రభుత్వ సర్వేల సమయంలో కష్టపడి విధులు నిర్వహించిన తమకు, దానికి తగిన రెమ్యునరేషన్ అందించడంలో అధికారులు నిరక్ష ్యం వహించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. విధులను వాడుకుని ఫలితం అందించడంలో జాప్యం చేయడం వల్ల తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పటికైనా స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రమేష్ రెడ్డి, బిఎల్వోలు గీతాంజలి, అమృత, సరోద, రత్నమాల, రజిత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# గనుల భద్రతా నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

## శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ - కోల్ మైన్స్ రెగ్యులేషన్స్ 2017, 2026 మార్పులపై అధికారులతో సమీక్ష

**నస్పూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం గనుల భద్రతా నిబంధనలపై సమీక్ష సమావేశం జరిగింది. ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో వివిధ విభాగాల అధిపతులు, గనుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు. కోల్ మైన్స్ రెగ్యులేషన్స్ 2017తో పోలిస్తే కొత్తగా వచ్చిన 2026 నిబంధనల్లోని మార్పులపై ప్రధానంగా చర్చించారు. కార్మికుల భద్రత, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన రక్షణ చర్యల గురించి అధికారులకు జీఎం దిశానిర్దేశం చేశారు. కొత్త రెగ్యులేషన్లలో ప్రవేశపెట్టిన సేఫ్టీ మేనేజ్ మెంట్ సిస్టమ్, రిస్క్ అసెస్మెంట్, మెడికల్ పర్యవేక్షణ, కార్మిక సంక్షేమ సదుపాయాల వంటి అంశాలపై సమావేశంలో స్పష్టత ఇచ్చారు. పాత విధానాలకు, కొత్త నిబంధనలకు మధ్య గల ప్రధాన తేడాలను విశ్లేషించారు. గనుల్లో ప్రతి నిబంధనపై సిబ్బందికి అవగాహన ఉండటం అత్యవసరమని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఆరోగ్య పరీక్షలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి గనిలో రోజువారీ అవగాహన తరగతులు నిర్వహించి రక్షణ అంశాలపై ఉద్యోగులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని చెప్పారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ రెగ్యులేషన్స్‌పై ప్రాక్టికల్ అవగాహన కల్పించాలని, అమలులో ఎటువంటి లోపాలు ఉండకూడదని హితవు పలికారు. కొత్త నిబంధనల అమలుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు సమావేశంలో పాల్గొన్న అధికారులు తెలిపారు. సమావేశంలో ఇంచార్జ్ ఎస్ఓ టు జీఎం కుర్మ రాజేందర్, ఏరియా ఇంజినీర్ టీ రమణ రావు, ప్రాజెక్ట్ అధికారులు ఏ వెంకటేశ్వర రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఏజెంట్లు శ్రీధర్, జీ రవికుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు, వివిధ గనుల మేనేజర్లు, గ్రూప్ ఇంజనీర్లు, పిట్ ఇంజనీర్లు, రక్షణాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పారిశుధ్యానికే ప్రథమ ప్రాధాన్యత

## - సర్పంచ్ పాల్దె అక్షర అనిల్

**దిలావర్పూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**



గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య సమస్యల పరిష్కారానికే తమ మొదటి ప్రాధాన్యత అని దిలావర్పూర్ సర్పంచ్ పాల్దె అక్షర అనిల్ స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన గ్రామ పంచాయతీ సాధారణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత రెండు ఏళ్లుగా పారిశుధ్యం కుంటుపడిందని, ఇకపై కమిటీల ద్వారా ఒక్కో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యంగా పందుల వల్ల ఎదురవుతున్న సమస్యల నివారణకు సమావేశంలో కీలక తీర్మానం చేశారు. అనంతరం అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామ పంచాయతీ సమీపంలోని పీరీల తక్కె నుండి కోడె విఠల్ ఇల్లు వరకు నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నడుకుడ సుఖేష్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు తోట శ్రీకాంత్, అనిల్, ముఖేష్, సాయి, రవి, భూమేష్, మహిళా వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు విజ్ఞాన వేదిక గ్రంథాలయం

## - ఎస్సై అనిల్ కుమార్

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై, సర్పంచ్

మండలంలోని ఎల్లూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ గ్రంథాలయాన్ని సర్పంచ్ చప్పిడి రవీందర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై అనిల్ కుమార్ రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుపై దృష్టి సారించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ గ్రామ యువత చదువుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్ఎం గోపాల్ రెడ్డి, అరె సంక్షేమం సంఘం తాలూకా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కుకిడే రాజేష్, నాయకులు అంకన్న, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ వాయు నియామకాలను యువత సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

నిర్మల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



దేశసేవ చేయాలనుకునే యువతకు భారత వాయిసేన దళంలో చేరేందుకు అగ్నివీర్ నియామకాలు ఒక గొప్ప అవకాశమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ 2026 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, అర్హులైన అభ్యర్థులు ఎటువంటి ఆన్లైన్ దరఖాస్తులు లేకుండానే నేరుగా ర్యాలీకి హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో గల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మార్చి 9వ తేదీన మహిళా అభ్యర్థులకు, 15వ తేదీన పురుష అభ్యర్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తారని వెల్లడించారు. అభ్యర్థులు తమ విద్యార్హత ఒరిజినల్ పత్రాలతో పాటు ఆరు సెట్ల జిరాక్స్ కాపీలు, పది పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని, జిల్లాలోని అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



## ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి విస్తృత పర్యటన

### - పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సారంగాపూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త


నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని అల్లూరు, గోపాల్‌పేట్, బీరవెల్లి గ్రామాల్లో వీవో భవనాలు, వర్క్ షెడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం అల్లూరు, చించోలి (బి), బీరవెల్లి, కాంకెట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సనాతన ధర్మ రక్షణకు, హిందూ సామ్రాజ్య స్థాపనకు కృషి చేసిన మహావీరుడు శివాజీ అని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, మన ఆచార సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగిసిన మల్లన్న జాతర

### - పోటెత్తిన భక్తజనం

సారంగాపూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:

మండలంలోని చించోలి(ఎం) గ్రామ శివారులో వెలసిన మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ముగిశాయి. మంగళవారం మల్లన్న స్వామి పల్లకి ఊరేగింపుతో ప్రారంభమైన ఈ వేడుకలు, బుధవారం రాత్రి ఉత్సవమూర్తి పల్లకి సేవతో వైభవంగా కొనసాగాయి. జాతరలో భాగంగా భక్తులు భజన కీర్తనల మధ్య అంబళ్లను ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. భక్తుల సౌకర్యార్థం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేయగా, గురువారం ఉదయం అన్నపూజ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ జాతరలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్, 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది, ఒకేషనల్ 888 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది, ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోసిట్ పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.50 గంటల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి 11 గంటల వరకు, ఎస్.ఎస్.సి. ఒకేషనల్ కోర్స్ (థియరీ) పరీక్ష ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు, మిగతా పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 9 వేల 703 మంది రెగ్యులర్, 45 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 163 బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధం నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలు లీక్ అయినట్లుగా అవాస్తవాలను ప్రచారం చేసినట్లయితే సంబంధిత వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు సులభంగా జీర్ణమయ్యే ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, పరీక్షల సమయంలో వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష నిబంధనలను పాటించేలా అవగాహన కల్పించాలని, జిల్లాలో వార్షిక పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



## మున్సిపల్ చైర్మన్‌గా దొంత అంజలి బాధ్యతలు స్వీకరణ

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

లక్షెట్టిపేట మున్సిపాలిటీ చైర్మన్‌గా దొంత అంజలి గురువారం రోజున మున్సిపల్ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా మెత్కూరి రాజేశ్వరి, వాడు కౌన్సిల్ సభ్యులు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దొంత అంజలి మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చట్టబద్ధంగా అప్పగించబడిన అన్ని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో సానిటేషన్, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తాను. ప్రతి ఇంటికి, వాణిజ్య స్థావరాలకు డోర్‌టుడోర్ చెత్త సేకరణను నిరంతరంగా నిర్వహించి, ఘన, ద్రవ వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో ప్రాసెస్ చేయడంపై దృష్టి సారిస్తాను. పట్టణంలో పార్కుల అభివృద్ధి, నూతన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, నీటి వనరుల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ, నీటి నష్టం, అనవసర విద్యుత్ బోర్ల వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడతాను. పర్యావరణ పరిరక్షణ దిశగా గ్రీన్ సెల్ ఏర్పాటు చేసి, బడ్జెట్లో 10 శాతం నిధులు మొక్కలు నాటడానికి కేటాయించి, జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించిన విధంగా నర్సరీల అభివృద్ధి చేపడతాను. ప్రతి వార్డులో మొక్కలు నాటించి కనీసం 85 శాతం మొక్కలు జీవించేందుకు చర్యలు తీసుకుంటాను. మున్సిపల్ ఆస్తులపై అక్రమ ఆక్రమణలను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాను. ప్రతి సంవత్సరం వార్షిక ఖాతాల ముగింపు, ఆడిట్ ప్రక్రియలు సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాను. ఇంటి పన్నులు, ఇతర పన్నులు 100 శాతం వసూలు అయ్యేలాగా ప్రణాళికలు సిద్ధం చేసి తద్వారా పట్టణ అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేస్తాను .నా తోటి వైస్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిల్ సభ్యులు, అధికారులు, ప్రజల సహకారంతో లక్షెట్టిపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు నిబద్ధతతో పని చేస్తానని తెలియజేయుచున్నాను.

## నూతనంగా ఎన్నికైన 9వ వార్డు కౌన్సిలర్‌కు ఘన సన్మానం

### - వార్డ్‌లో నెలకొన్న సమస్యలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం వినతి

### - దుంపల రంజిత్ కుమార్.. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు కౌన్సిలర్ గా గెలిచిన వడ్డేపల్లి రాజలింగుని గురువారం రోజున సిపిఎం ఆధ్వర్యంలో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలుపుతూ, వార్డ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గత 7 ఏళ్ళుగా వార్డు ప్రజలకు ఉపాధి లేక కుటుంబ పోషణకు,పిల్లల చదువులకు, రోజు వారి ఖర్చులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలకు, అంగన్వాడీ కేంద్రంకు నూతన భవనం, గ్రంథాలయం నిర్మాణం చేపట్టాలన్నారు. ఇల్లు స్థలం లేని, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు. కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వార్డ్‌లో అవసరమైన దగ్గర రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓపెన్ జిమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. మిషన్ భగీరథ నీటిపై పన్ను లేకుండా ఉచితంగా అందించాలన్నారు. ప్రతి సంవత్సరం పెంచే ఇంటి పన్నును పెంచవద్దన్నారు. అర్హులైన వారికి అన్ని రకాల పెన్షన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.



వార్డులోని సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేత



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

**దస్తురాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

మండలంలోని దేవునిగూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను సర్పంచ్ ఎండపెల్లి గంగన్న, హౌసింగ్ ఏఈ శివ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా స్లాబ్ నిర్మాణ పనులను (స్లాబ్ ఇన్స్పెక్షన్) పర్యవేక్షించి, నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా, ముఖ్యంగా స్లాబ్ వేసే సమయంలో క్వాలిటీ సరిగ్గా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకుని పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంశీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**



జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జీవో నం. 252 ప్రకారం రాష్ట్రంలోని అర్హులైన వారికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్స్, అనుభవజ్ఞులైన జర్నలిస్టులు ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు, జారీ ప్రక్రియ రోలింగ్ ప్రాతిపదికన కొనసాగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే దరఖాస్తుదారులు కార్యాలయ వేళల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 వరకు చరవాణి నెంబర్ 9154170881లో మీడియా రిలేషన్స్ వింగ్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## బీసీ కులాల ప్రజలు రిజర్వేషన్ల సాధన ఉద్యమంలో మరింత చురుకుగా పాల్గొనాలి

**జన్నారం, ఫిబ్రవరి,19, ప్రభాతవార్త**



బీసీ కులాల ప్రజలు రిజర్వేషన్ల సాధన ఉద్యమంలో మరింత చురుకుగా పాల్గొనాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్ జంగం సంతోష్ అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలు 42 శాతం టికెట్లు ఇవ్వకుండా బీసీ కులాల వారు వచ్చిన మార్పుతో 62 శాతం సీట్లలో బీసీలు గెలవడం జరిగిందని. గత నాలుగు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో అనేక బీసీ సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అలాగే ఢిల్లీలోనూ అనేక ఉద్యమ కార్యక్రమాలు చేపట్టారని, గత ఏడాది డిసెంబర్ రెండవ వారంలో మూడు విడతల్లో జరిగిన సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలలో 50 శాతం పైగా బీసీ కులాల వారు సర్పంచులు ఉప సర్పంచ్, వార్డు మెంబర్లుగా గెలిచి చరిత్ర సృష్టించారని అన్నారు. మున్సిపల్ , అలాగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున చాలావోట్ల బీసీ కులాల వారికి ఎక్కువమందికి టికెట్లు ఇవ్వడం వలన వచ్చిన ఫలితాలలో దాదాపు 62 శాతం బీసీ కులాల వారు మున్సిపల్ చైర్మన్ గా, వైస్ చైర్మన్ గా, కార్పొరేషన్ మేయర్లుగా, కార్పొరేటర్లుగా ఎన్నికయ్యారని ఇది బీసీ కులాల ప్రజల విజయంగా భావిస్తున్నాం అని అన్నారు. ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి బీసీ కులాల వారు తమ శక్తి యుక్తులను ఉపయోగించి 2029లో జరిగే, శాసనసభ పార్లమెంటు ఎన్నికల్లో బీసీ కులాల ప్రతాపాన్ని చూపవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మహిళా మూర్తులు 60 శాతానికి సమీపంగా పదవులు చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం అని అలాగే ఉద్యమ విస్తరణలు విద్యావంతులైన మహిళా మూర్తులు ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య, కో కన్వీనర్ కదార్ల నరసయ్య, జన్నారం మండలం బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గేట్స్ ఫౌండేషన్ సహకారంతో

# వెనుకబడిన జిల్లాలకు మరిన్ని సేవలు



మాట్లాడుతున్న నీతి అయోగ్ సి ఈ ఓ సుబ్రహ్మణ్యం




పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

నీతి అయోగ్ ద్వారా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో వెనుకబడిన జిల్లాలకు మరిన్ని సేవలు అందించడం జరుగుతుందని నీతి అయోగ్ సిఈఓ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం న్యూఢిల్లీలోని నీతి అయోగ్ ప్రధాన కార్యాలయం నుండి వర్చువల్ ద్వారా గేట్స్ ఫౌండేషన్ సిఈఓ బిల్ గేట్స్, ఇతర కార్యదర్శులతో కలిసి నీతి తారా పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సిఈఓ మాట్లాడుతూ దేశంలోని 340 పైగా జిల్లాల్లో నీతి అయోగ్ ద్వారా సంపూర్ణత అభియాన్ క్రింద విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం, మహిళలకు రివాల్వింగ్ ఫండ్ వంటి వాటిని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమాలలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవరెడ్డి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 50 శాతం సబ్సిడీపై సాగు యంత్రాలు

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని రైతులకు ఎస్.ఎం.ఏ.ఎం పథకం కింద యాభై శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి కె. కార్తీషా ఒక ప్రకటనలో తెలిపారు. 202526 సంవత్సరానికి గాను బ్యాటరీ స్ప్రేయర్లు, రోటవేటర్లు, కల్టివేటర్లు, పవర్ టిల్లర్లు, వీడర్లు తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు, ఫోటోలతో స్థానిక ఏఈవో లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని. ట్రాక్టర్ పరికరాల కోసం ఆర్సీ బుక్ తప్పనిసరి. ఎంపికైన రైతులకు నేరుగా కంపెనీల ద్వారా యంత్రాలు సరఫరా చేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోచేసుకోవాలని అన్నారు

# నాగంపేట అంగన్వాడీకి ఫర్నిచర్ విరాళం

### - పిల్లల ప్రతిభకు ఫిదా అయిన ఫౌండేషన్ బృందం

**కోటపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

నాగంపేట అంగన్వాడీ కేంద్రం చిన్నారుల ప్రతిభ అద్భుతంగా ఉందని క్రెడిట్ యాక్సెస్ ప్రాటెర్నల్ ఫౌండేషన్ ప్రతినిధులు కొనియాడారు. గురువారం మంచిర్యాల జిల్లా, కోటపల్లి మండలంలోని నాగంపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన క్రెడిట్ యాక్సెస్ ప్రాటెర్నల్ ఫౌండేషన్ ప్రతినిధులు పిల్లలకు 30 కుర్చీలు, 4 పెద్దల కుర్చీలు, కార్పెట్లను విరాళంగా అందజేసి మొక్కలు నాటారు. అంగన్వాడీ టీచర్ జి. కవిత, హెల్పర్ జె. సరోజల పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి. మాధవి, హెచ్.ఎం అశోక్ కుమార్, ఎస్‌జీటిలు సతీష్, కృపాల్, విద్యా వాలంటీర్లు సంపత్, రమ్య, ఉప సర్పంచ్ ఎం. స్వామి, గ్రామస్తులు సంతోష్, లింగయ్య, రాజయ్య పాల్గొన్నారు.



కుర్చీలను విరాళంగా అందజేస్తున్న దృశ్యం

## ఈ నెల 20 నుంచి 5వ బ్యాచ్ శిక్షణ కొరకు దరఖాస్తుల స్వీకరణ

### - టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్

**నస్పూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుండి 5వ బ్యాచ్ శిక్షణ కొరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు ఉపాధి నైపుణ్యాల మెరుగుదల, పరిశ్రమల సంబంధిత నైపుణ్యత, ఉపాధి అవకాశాల కల్పన అంశాలపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణలో సి, సి++, హెచ్‌టిఎంఎల్, జావా స్క్రిప్ట్‌తో సిఎస్ఎస్, జావా, పైతాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్ (ఎ అండ్ ఆర్), ఇంటర్వ్యూ స్కిల్స్, బూట్ స్ట్రాప్, వెబ్ డెవలప్మెంట్ అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు 18 33 సంవత్సరాల మధ్య వయసు కలిగి, ఏదేని డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుండి తరగతులు ప్రారంభించడం జరుగుతుందని, ఇతర వివరాలకు 7989733351 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.



మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్‌ను సన్మానిస్తున్న చెన్నూరు చైర్మన్ పెద్దింటి పద్మ

## మంచిర్యాల మేయర్‌ను కలిసిన చెన్నూరు మున్సిపల్ చైర్మన్

### - ఒకరినొకరు సన్మానించుకున్న ప్రజాప్రతినిధులు

**నస్పూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్‌ను చెన్నూరు మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ మర్యాదపూర్వకంగా కలిశారు. నస్పూర్‌లోని మేయర్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఒకరినొకరు శాలువాలతో సన్మానించుకున్నారు. మేయర్ మధుకర్, చెన్నూరు చైర్మన్ పద్మకు స్వయానా మేనమామ కుమారుడు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగింది.



అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

# బాల్క సుమన్ అరెస్టుకు నిరసనగా బంద్ సంపూర్ణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు బంద్ నిర్వహించారు. మండలంలోని కిరాణా దుకాణాలు, పాఠశాలలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. తాండూర్ మండలంలో కూడా బంద్ కొనసాగింది. వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతపడి నిరసనకు మద్దతు తెలిపారు. మొత్తంగా బాల్క సుమన్ అరెస్టుకు నిరసనగా బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా కొనసాగింది.

## బాల్క సుమన్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం: రామడుగు లక్ష్మణ్

**క్యాతన్‌పల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్ అక్రమ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 17న క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్ అభ్యర్థులను ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్న సందర్భంగా హాల్లో జరిగినటువంటి దుస్స సంఘటన పై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు,అలాగే 21 వ వార్డు సభ్యురాలైన బబ్బెర స్వర్ణలత వాళ్ళ అత్తమ్మతో కిడ్నాప్ చేశారని అనే తప్పుడు సంతకాలు పెట్టుకొని టిఆర్ఎస్ సిపిఐ కౌన్సిలర్లను పోలీసులు ప్రమాణ స్వీకారానికి వెళ్లకుండా,పోలీసులు ఉద్దేశపూర్వకంగానే నివారించడం దురదృష్టకరమని అన్నారు.ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన తోపులాటలో పోలీసులు మంత్రి ఆదేశాల మేరకు లాఠీ ఛార్జ్ నిర్వహించి కాంగ్రెస్ శ్రేణులు మంత్రి ఎంపీ కాన్వాయ్ పై జరిగిన దాడిలో డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించి, గొడవలకు కారణం అయ్యాడని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా బాల్క సుమన్ ఇంటిని నిర్బంధించి అరెస్టు చేయడం కుట్రపూరితమైన చర్యలని మంచిర్యాల జిల్లా మేధావులు యావత్ ప్రజానీకం ముక్త కంఠంతో ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తున్నారని అన్నారు. క్యాతనపల్లి మెజార్టీ కౌన్సిల్ సభ్యుల ఎన్నికను తక్షణమే నిర్వహించి కాక వెంకటస్వామి పేరు ప్రతిష్టలను ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను బిఆర్ఎస్ సిపిఐ కలిసి ఎన్నికలలో ప్రజల ఇచ్చిన తీర్పును శిరసావహించి, పారదర్శకంగా ఎలక్షన్ నిర్వహించాల్సిన బాధ్యత అధికారులదని అన్నారు.

## అక్రమ అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి,19 ప్రభాతవార్త**

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్‌కు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో బందులో పాల్గొని నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించడం సరైంది కాదని, ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు.




పట్టణంలో మూసి ఉన్న దుకాణాలు

## మాజీ ఎమ్మెల్యే సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలి

**తాండూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :**

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పై బనాయించిన అక్రమ కేసులను ఉపసంహరించుకొని, వెంటనే భేషరతుగా జైలు నుంచి విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. బాల్క సుమన్ అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం జిల్లా బందుకు బిఆర్ఎస్ పార్టీ బందుకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా పలువురు పార్టీ శ్రేణులు ఉదయమే ఐబికి చేరుకొని బందును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులుమాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మంత్రి గడ్డం వెంకటస్వామి ప్రజాస్వామాన్ని ఖూనీ చేశాడని మండిపడ్డారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బిఆర్ఎస్, సిపిఐ పార్టీలకు మెజార్టీ ఉన్నప్పటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగకుండా మంత్రి కుట్రలు పన్ని ఎన్నికను వాయిదా వేయించాడని ఆరోపించారు. సుమన్ పై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేయించాడని ఫైర్ అయ్యారు. మంత్రి వివేక్ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలోపార్టీ మండల అధ్యక్షుడు సుబ్బా దత్తుమూర్తి, ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ తాళ్లపల్లి పురుషోత్తం గౌడ్,మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ సతీష్, నాయకులు దత్తాత్రేయ రావు, బోనగిరి చంద్రశేఖర్, ఎలుక రామచందర్, మాసాడి శ్రీరాములు, గట్టు సంతోష్ కుమార్, భీమ లింగయ్య, అడ్వాల సత్యనారాయణ, జాడి పోశం, చింటూ, బాబుఖాన్, క్రాంతి కుమార్, రాజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మందమర్రి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో గురువారం భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మాజీ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుకు వ్యతిరేకిస్తూ నిరసనగా బంద్ పిలుపునిచ్చారు. బంద్ పిలుపుతో పట్టణంలోని పలు వాణిజ్య సంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. కొంతమంది వ్యాపారులు సంఘీభావంగా షాపులు మూసివేయగా, మరికొన్ని చోట్ల పాక్షికంగా కార్యకలాపాలు కొనసాగాయి. విద్యాసంస్థలలో కూడా మూసివేయబడ్డాయి. బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన రహదారులపై ర్యాలీలు నిర్వహించి అరెస్టును ఖండించారు. ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు తో ఈ చర్యలకు దిగిందని ఆరోపించారు. పరిస్థితి దృష్ట్యా పోలీసులు భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షించారు.

**తాండూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :**

బిఆర్ఎస్ పార్టీ బంద్ పిలుపులో భాగంగా తాండూర్ మండలం ఐబిలో గురువారం బంద్ పాక్షికంగా జరిగింది. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయమే ఐబి చేరుకొని బంద్ ను పరిశీలించి బంద్ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని సహకరించాలని ప్రచారం చేశారు. దీంతో షాపు యజమానులు స్వచ్ఛందంగా షాపులను మూసి వేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత యజమానులు స్వచ్ఛందంగా షాపులు తెరిచి వ్యాపారం యధావిధిగా కొనసాగించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## శాంతియుత ర్యాలీ..

**జైపూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మాజీ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అక్రమ అరెస్ట్‌కు నిరసనగా జైపూర్ మండలంలో గురువారం బంద్ సక్సెస్ అయింది. జైపూర్ మండలం కేంద్రంతో పాటు గ్రామాల్లో దుకాణ సముదాయాలు,వ్యాపారులు స్వచ్ఛందగా బంద్‌లో పాల్గొనగా విద్యా సంస్థలు పూర్తి మద్దతు తెలుపుతూ బంద్‌లో పాల్గొన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అరవింద్ రావు మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీకి మెజారిటీ ఉన్నపటికీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి వివేక్ వెంకటస్వామి కక్ష్య సాధింపు చర్యలు చేశారని, ఎన్నికను రెండు సార్లు వాయిదా వేయించి,మహిళ కౌన్సిలర్లను ఇబ్బందులకు,ప్రలోభాలకు గురి చేసినా ఫలితం లేకపోవడంతో తప్పుడు కేసులతో బాల్క సుమన్‌ను అరెస్ట్ చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ఆర్నె సమ్మయ్య, వెంకగౌడ్, రిక్కుల లక్ష్మీనారాయణ రెడ్డి, పాలమాకుల లింగారెడ్డి, సమ్మయ్య, నామాల తిరుపతి, జగన్ గౌడ్, లింగస్వామి, సంతోష్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తాండూర్ ఐబిలో ఉదయం మూసి ఉన్న దుకాణాలు



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బి.ఆర్.ఎస్ నాయకులు



నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

### కాలనీలో నెలకొన్న సమస్యలను

# పరిష్కరించేందుకు కృషి



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డ్ కౌన్సిలర్ చిలివేరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక వాసవి ఆలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ ప్రోత్సాహంతో కాలనీని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై విశ్వాసంతో కౌన్సిలర్ గా గెలుపునకు సహకరించిన కాలనీవాసులకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కౌన్సిలర్ దంపతులు, గవర్నమెంట్ ప్లీడర్, సెంట్రల్ గవర్నమెంట్ కు చెందిన సీనియర్ స్టాండింగ్ కౌన్సిలర్ బోనగిరి సతీష్ బాబుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్యులకు సంబంధించి పేరు, గోత్రము, ఫోన్ నెంబర్ తో ప్రింట్ అయిన పుస్తకంను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి టెంపుల్ కమిటీ చైర్మన్ రావుల శంకర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎక్కిరాల శ్రీనివాస్, మురళి, వెంకన్న, వేణుగోపాల్, పాత శ్రీనివాస్, రవీందర్, శ్రీనివాస్, ప్రకాష్, కిరణ్, వినేష్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన మున్సిపల్ చైర్మన్‌గా షాహీన్ సుల్తానా బాధ్యతలు స్వీకరణ

**- పట్టణ అభివృద్దే లక్ష్యంగా నూతన పాలక వర్గం కృషి చెయ్యాలని - ఎమ్మెల్సీ దండే విఠల్**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మున్సిపల్ నూతన చైర్మన్‌గా షాహీన్ సుల్తానా గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన్నన షాహీన్ సుల్తానా ను శాలువాతో సత్కరించి నూతన చైర్మెన్, నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికలతో ముగిశాయని, పట్టణ అభివృద్దే లక్ష్యంగా నూతన పాలక వర్గం కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్సీ దండే విఠల్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యర్యక్రమంలో నూతన పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# బెల్లంపల్లి బస్తీలోని డంప్ యార్డును వెంటనే తొలగించాలి

**- మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతిపత్రం అందజేత**

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తీ ప్రాంతంలో ఉన్న డంప్ యార్డును వెంటనే తరలించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. 4వ వార్డు కౌన్సిలర్ ఈట కమల, 19వ వార్డు కౌన్సిలర్ సిమ్రాన్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ఈట రాకేష్, ఖలీం బస్తీవాసులతో కలిసి కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీ సమీపంలో చెత్త డంప్ యార్డు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెత్త కుప్పల నుంచి దుర్వాసన రావడం, దోమలు పెరగడం వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డంప్ యార్డు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. డంప్ యార్డును వెంటనే ఇతర ప్రాంతానికి తరలించి బస్తీవాసులకు ఉపశమనం కల్పించాలని కమిషనర్‌ను వినతిలో కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు, యువకులు పాల్గొన్నారు.

# ఈ నెల 22న గురుకుల ప్రవేశ పరీక్ష

**- ఉదయం II నుంచి మధ్యాహ్నం I గంట వరకు నిర్వహణ**

**- హాల్‌టికెట్లును వెబ్‌సైట్ నుంచి లోడ్ చేసుకోవాలి**

**- ప్రిన్సిపాల్ వూటూరి సంతోష్ కుమార్**



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ సెట్ ప్రవేశ పరీక్ష ఈ నెల 22న (ఆదివారం) నిర్వహించనున్నట్లు కాసిపేట గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వూటూరి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని శివాలయం సమీపంలో గల పరీక్షా కేంద్రంలో ఈ పరీక్ష నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. పరీక్ష ఆదివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఓఎంఆర్ షీట్ విధానంలో ఉంటుందని, అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్, ఆధార్ కార్డు, ఎగ్జామ్ ప్యాడ్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ వాచీలను అనుమతించబోమని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెంటనే తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.



# బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ రామచంద్ర రావును కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ డా.అనిత

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :**

హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ రాంచందర్ రావు, అగ్ర నాయకత్వాన్ని కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సందర్భంగా డా. కొత్తపల్లి అనిత డా. కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ అయ్యన్న గారి భూమన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచంద్ర రావు, రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీ చంద్రశేఖర్ తివారి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ దేవేందర్ గౌడ్ డా. కొత్తపల్లి అనితను సన్మానించి అభినందించారు.